RNI NO: TELTEL/2023/87917

# జనం వెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

అనునిత్యం అక్షరసత్యం

సంపుటి: 03 సంచిక: 63 శుక్రవారం 16 మే 2025 ఎడిటర్: సీతార్ల సురేష్ పేజీలు: 8



విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119


## వేసవిలో బాల భవన్ సందడి

***పిల్లల సృజనాత్మకతకు పదును***
***ప్రారంభమైన శిక్షణ తరగతులు***
***బాల్ భవన్ లో సందడి చేయనున్న బుడతలు***

**జనం వెలుగు, నిజామాబాద్:–** వేసవి సెలవుల సందడిలో బాల భవన్ మరోసారి పిల్లల కలల బాటలో ఓ అందమైన ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలనే లక్ష్యంతో ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సంపద నగరంలోని బాల భవన్ ఈ సారి మరింత విస్తృతంగా, సృజనాత్మకతకు అద్దాగా శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించింది. పాఠశాలలు, కళాశాలల్లో నిత్యం విద్యాభ్యాసంలో తలమునకలైన చిన్నారులకు వేసవి సెలవుల్లో వినోదంతో పాటు నైపుణ్యం పెంచేలా బాల భవన్ వినూత్న కార్యక్రమాలను అందిస్తోంది. పిల్లల అభిరుచులు, ప్రతిభను గుర్తించి – వారికి తగిన మార్గనిర్దేశనతో శిక్షణ ఇచ్చేందుకు అనేక రంగాలకు చెందిన నిపుణులను ఏర్పాటు చేశారు.

**విభిన్న కోర్సుల పంట**

బాల భవన్ నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో క్రీడలు, డ్రాయింగ్, పెయింటింగ్, భరతనాట్యం, జానపద నృత్యం, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మిర్రర్ వర్క్, సంగీతం తదితరంగా మొత్తం 30 అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. ప్రతి కోర్సును అనుభవజ్ఞులైన నిపుణులు చేపడుతున్నారు. చిన్నారుల్లోని సృజనాత్మకతకు శక్తినిచ్చేలా ఈ తరగతులు రూపొందించబడ్డాయి.

**పిల్లల ప్రతిభకు వేదిక**

ఏప్రిల్ 16 నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులు జూన్ 10 వరకు కొనసాగనున్నాయి. మొత్తం 55 రోజుల పాటు బాల భవన్ పరిసరాలు






విద్యార్థులతో సందడిగా మారనున్నాయి. ప్రతిరోజూ ఆహ్లాదకరమైన వాతావరణంలో, ఆటపాటల మధ్య అభ్యాసం జరగనుండటంతో పిల్లలు ఉత్సాహంగా తరగతుల్లో పాల్గొంటున్నారు.

**మాతృభాషతో పాటు మాదిరిగా నైపుణ్యం**

బాల భవన్ తరగతుల్లో నైపుణ్యాన్ని నేర్పడమే కాదు, పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా శిక్షణ పద్ధతులు అమలవుతున్నాయి. బహుముఖ ప్రతిభను ప్రోత్సహించే ఈ తరగతులు ఎంతో మంది విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తున్నాయి.

**సృజనాత్మకతకు సందడి వేదిక**

ఈ వేసవి సెలవుల్లో పిల్లలకు వినోదం, విజ్ఞానం కలగలిపిన అనుభూతిని అందించేందుకు బాల భవన్ చేసిన ఈ వినూత్న యత్నం అభినందనీయం. విద్యార్థుల జీవితాల్లో ఈ శిక్షణ తరగతులు, వారి భవిష్యత్‌కు శక్తివంతమైన పునాది వేస్తున్నాయి.

**వీరు అర్హులు**

బాల్ భవన్ ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులకు ఐదేళ్ల నిండి 16 సంవత్సరాల లోపు బాల బాలికలు అర్హులు.ప్రవేశాలకు వచ్చే పిల్లలు రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు,డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్, ధ్రువీకరణ పత్రాలు తీసుకొని రావాలని తెలిపారు.

**విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీయడమే మా లక్ష్యం**

**మల్లాది ఉమా బాలా, బాల్ భవన్ ఇన్చార్జి సూపర్డెంట్**




విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని మల్లాది ఉమాబాల ఇన్చార్జి సూపరిండెంట్ అన్నారు. ఏప్రిల్ 16 నుంచి జూన్ 10 వరకు 55 రోజులపాటు విద్యార్థులకు బాల్ భవన్ లో నిర్వహించే ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులను చిన్నారులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటివరకు వివిధ అంశాల్లో 650 మంది విద్యార్థులు అడ్మిషన్ చేసుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.

## చైన్ స్నాచింగ్ కేసులలో నిందితుల అరెస్టు

**జిల్లా పోలీసు కమీషనర్ సాయి చైతన్య**





**జనం వెలుగు, ఆర్మూర్:–** ఆర్మూర్ డివిజన్ లోని వివిధ మండలాలలో చైన్ స్నాచింగ్ కు పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా పోలీసు కమీషనర్ పి.సాయి చైతన్య తెలిపాడు. ఆర్మూర్ పోలీసు స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడాడు. బొబ్బిలి లక్ష్మి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నామోదు చేసుకుని దర్యాప్తు చేయగా మెల్ల మెల్లగా నేరస్థుల వివరాలు బయటకు వచ్చాయని ఆయన అన్నాడు. శ్రీనివాస్ సాహెబ్ రావు పిటేవాడ్ పొంనాల గ్రామం, బోకర్ తాలూక నాందేడ్ జిల్లా, గోరే కేశవ్ సురేష్ రేనాపూర్ గ్రామం, బోకర్ తాలూక, నాందేడ్ జిల్లా,పుర్బాజి బాలాజీ ఇర్లేవాడ్ పొంనాల గ్రామం, బోకర్ మండలం, నాందేడ్ జిల్లా మహారాష్ట్ర, ఎలిశెట్టి శ్రీనివాస్ తల్వాడ గ్రామం, నిర్మల్ జిల్లా, రాజు అప్పారావు పిటేవాడ్, పొంనాల గ్రామం, సోనారి, బోకర్ మండలం, నాందేడ్ జిల్లా మహారాష్ట్ర, విజయ్, దండేవాడ్ బాబు తథితర నిందితులను పట్టుకుని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపాడు. 14 గ్రాముల బంగారు పుస్తెల త్రాడు, 10 గ్రాముల బంగారు చైన్, 23 గ్రాముల బంగారు గొలుసు, 10 గ్రాముల బంగారు గుండ్ల పేరు, 5 గ్రాముల బంగారు పుస్తెల గుండ్ల పేరు, 20 గ్రాముల బంగారు గొలుసు, 20 గ్రాముల బంగారు గొలుసు, 20 గ్రాముల బంగారు గొలుసు, ఒక ట్రాక్టర్ TS16U1464 మరియు దాని ట్రాలీ TS16UC5200, హిరో స్ప్లెండర్ బైక్, ఎంఎచ్ 26CR6549 రాయల్ ఎన్ ఫీల్డ్ బైక్ తో సహా బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపాడు. విజయ్, దండేవాడ్ బాబులు ఫరారీలో ఉన్నారని ఆయన చెప్పాడు. ఆర్మూర్ పోలీసు స్టేషన్ క్రైం పార్టీ పోలీసులు నేరస్థులను పట్టుకోవడానికి టీంలుగా ఏర్పడి చేసిన కృషి ఫలితంగా నిందితులను పట్టుకోవడం జరిగిందని ఆయన తెలిపాడు. నిందితులను పట్టుకున్న పోలీసులకు రివార్డులు ఇచ్చి అభినందించడం జరిగిందని ఆయన వివరించాడు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసిపి జె వెంకటేశ్వర రెడ్డి, సిఐ పి సత్యనారాయణ, ముప్కాల్ ఎస్ఐ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్న సిఎం

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్.**



**జనం వెలుగు, ఆర్మూర్:–** తెలంగాణ రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ కాంగ్రెసు పార్టీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీలను ప్రస్తుతం సిఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకుంటున్నాడని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నాడు. కామారెడ్డి మండలంలోని చిన్న మల్లారెడ్డి గ్రామంలో 18-03-2023 న కురిసిన అకాల వర్షాలకు ఇల్లు కూలిపోయి బిక్కు బిక్కు మంటున్న బిక్నూర్ లక్ష్మి, చిట్యాల రాజమణిల కూలిన ఇండ్లను చూసి కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇండ్లను కట్టిస్తానని ఇచ్చిన హామీ మేరకు గురువారం ఇందిరమ్మ ఇండ్ల పను లను మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రారంభించడం జరిగింది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడాడు. కాంగ్రెసు పార్టీ హామీ ఇస్తే తప్ప కుండా నెరవేరుస్తొందని ఆయన అన్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరి చేయడం జరిగిందని, ప్రతి నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, కామారెడ్డి నియోజక వర్గానికి 3028 మంది లబ్ధిదారులకు ఎంపిక చేయడం జరిగిందని త్వరలో 472 మంది లబ్ధిదారులకు ఎంపిక చేయడం జరిగిందని ఆయన తెలిపాడు. కాంగ్రెసు ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన 6 హామీలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపాడు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 రుపాయలకే వంట గ్యాస్ సిలిండర్, 2 లక్షల రూపాయల రుణమాఫి, రైతు భరోసా అంజేస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందిస్తున్నామని, కళ్యాణ లక్ష్మి, ఆరోగ్య శ్రీ చెక్కులను సకాలంలో లబ్ధి దారులకు అందిస్తున్నామని ఆయన అన్నాడు. రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించి ఫాం హౌస్ కే పరిమితమైన కేసిఆర్ కాంగ్రెసు పార్టీ ఇది చేస్తా లేదు అది చేస్తా లేదని ఆయన మండి పడ్డాడు.

## పసుపు మార్కెట్‌కు రంగం సిద్ధం

**నిజామాబాద్‌కు పసుపు బోర్డు, రైతుల్లో నూతన ఆశలు**

**పసుపు బోర్డు సెక్రటరీ భవాని**

**జనం వెలుగు, నిజామాబాద్:–** నిజామాబాద్ జిల్లా పసుపు రైతుల జీవితాల్లో ఓ కీలక మలుపు తిరిగింది. దేశవ్యాప్తంగా పసుపు ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన ఈ జిల్లాలో ఇప్పుడు పసుపు బోర్డు ఏర్పాటైన విషయం, రైతుల్లో సానుకూలత కలిగిస్తూ, కొత్త ఆశలను నూరుతోంది. పసుపు మార్కెట్ అభివృద్ధికి ఇది మైలురాయిగా నిలుస్తుందని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**రైతులలో ఆనందం, విశ్వాసం**

పసుపు బోర్డు నిజామాబాద్‌కు రావడం వల్ల జిల్లావ్యాప్తంగా పసుపు రైతుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. "ఇది ఒక నమ్మకం కనిపించింది," అని పసుపు బోర్డు సెక్రటరీ భవాని వ్యాఖ్యానించారు. జిల్లా మట్టిలో పసుపు అధికంగా పండించే నేపథ్యంలో, ఇక్కడే బోర్డు ఏర్పాటు చేయడం సరికొత్త అవకాశాలకు ద్వారాలు తీసుకురాబోతోంది.

**ఆర్గానిక్ సాగుకు ప్రోత్సాహం**

భవాని మాట్లాడుతూ, "పసుపు కేవలం వంటలకే పరిమితం కాదు. ఇది ఔషధ గుణాలున్న, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే దినసరి ఆహార పదార్థం. కాస్మెటిక్ రంగం, మసాలా పరిశ్రమలలోనూ దీనికి గిరాకీ ఎక్కువ. ప్రత్యేకించి ఆర్గానిక్ పద్ధతిలో పండిస్తే దీని క్వాలిటీ మరింత పెరుగుతుంది," అని అన్నారు.

**రైతుల కలకు బలమైన బాసట**

ఈ సందర్భంగా 5 గ్రామాల నుంచి వచ్చిన రైతులు ప్రకృతి సొసైటీ సహకారంతో పసుపు సాగుపై సమీక్ష నిర్వహించారు. పద్ధతులపై చర్చించుకొని, కలిసికట్టుగా ముందుకెళ్లే నిర్ణయం తీసుకోవడం పాజిటివ్ సంకేతంగా భావిస్తున్నారు అధికారులు. రైతులు స్వయంగా ఏర్పాటు చేసుకున్న పసుపు పరిశ్రమ, నిజామాబాద్‌కు తలమానికంగా మారబోతోందని భవాని అభిప్రాయపడ్డారు.

**పరిశోధన, అభివృద్ధికి వేదికగా బోర్డు**

పసుపు బోర్డు ద్వారా అధిక దిగుబడి కోసం పరిశోధనలు, పసుపు లోని ఔషధ గుణాలపై



అధ్యయనాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి వంటి విషయాలు జరుగనున్నాయి. ఇది రైతులకు మరింత ఆదాయాన్ని తీసుకురావడమే కాకుండా, సమగ్ర వ్యవసాయ అభివృద్ధికి దోహదపడనుంది.

**పసుపు పాలిట నూతన అధ్యాయం**

పసుపు మార్కెట్ స్థిరంగా ఉండడం, ధరలలో పారదర్శకత రావడం, సాగు నాణ్యత పెరగడం వంటి అంశాలలో ఈ బోర్డు కీలకంగా వ్యవహరించనుంది. ఇది నిజామాబాద్ రైతుల జీవితాల్లో కొత్త ఆశలు, అవకాశాలు తీసుకురావడంలో ముందడుగు అని చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో, పసుపు బోర్డు ఏర్పాటు నిజామాబాద్‌కు మాత్రమే కాకుండా, పసుపు సాగు మీద ఆధారపడి జీవించే ప్రతి రైతుకూ కొత్త వెలుగు చూపించే ప్రయత్నంగా నిలవనుంది.